క్లుప్తంగా

పోలింగ్ ఏర్పాట్లు పరిశీలించిన ఎమ్మెల్యే



పి.ధర్మవరంలో పర్యటించిన ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

ఎస్.రాయవరం : ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రం వద్ద అన్ని ఏర్పాట్లు సక్రమంగా ఉండాలని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. పోలింగ్ బూత్ ఉన్న గ్రామంలో ఆదివారం ఎమ్మెల్యే పర్యటించారు. ఏర్పాట్లపై అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీపతిరాజు, పోలిశెట్టి పెద ఈశ్వరరావు, అల్లాడ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వసతిగృహాల తనిఖీ



నక్కపల్లిలో వసతి గృహం తనిఖీ చేస్తున్న ఎంపీడీవో

నక్కపల్లి: మండల కేంద్రంలో బీసీ, ఎస్సీ వసతి గృహాలను ఎంపీడీవో డి.సీతారామరాజు ఆదివారం తనిఖీ చేశారు. విద్యార్థులకు వసతి గృహాల్లో పెడుతున్న మెనూ గురించి అడిగి తెలుసుకున్నారు. మరుగుదొడ్లలో రన్నింగ్ వాటర్ సదుపాయం ఉందా, వాడుకనీరు అందుబాటులో ఉంచుతున్నారా, తాగునీటి సదుపాయం ఎలా ఉంది అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని, అన్ని సదుపాయాలు కల్పించాలని వార్డెన్లకు సూచించారు. పదో తరగతి, పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో వసతి గృహాల్లో విద్యుత్ సదుపాయానికి అంతరాయం ఏర్పడకుండా చూడాలని, ప్రత్యేక తరగతులను నిర్వహించాలని సూచించారు.

అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు పూర్తి



అరబుపాలెంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులు

మునగపాక : అరబుపాలెం గ్రామంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు పూర్తయ్యాయి. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి రూ.4 లక్షల మేర నిధులు కేటాయించారు. సంబంధిత నిధులతో పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకువచ్చారు. సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు, ఎంపీటీసీ బొడ్డేడ హైమావతి పనులను పర్యవేక్షించారు.

తుపాకుల గెడ్డలో దుర్గంధం



కోటవురట్ల మెయిన్‌రోడ్డులో తుపాకుల గెడ్డలో పేరుకుపోయిన చెత్త

కోటవురట్ల : మండల కేంద్రం మెయిన్‌రోడ్డులో ఉన్న తుపాకుల గెడ్డ చెత్తకు నిలయంగా మారింది. స్థానిక వర్తకులు చెత్తనంతా తీసుకొచ్చి తుపాకుల గెడ్డలో వేస్తుండడంతోనే సమస్య వస్తోంది. చాలా కాలంగా చెత్త పేరుకుపోవడంతో దుర్గంధంతో పాటు దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. ప్రయాణికులు ఎక్కువగా ఈ వంతెన మీదనే వేచి ఉంటారు. అపారిశుద్ధ్యం కారణంగా ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి చెత్తను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడిగా జేజిబాబు

అనకాపల్లిటౌన్ : విశ్వబ్రాహ్మణ సంఘం అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు దాడి రత్నాకర్ అన్నారు. స్థానిక కామాక్షమ్మ ఆలయంలో ఆదివారం సంఘ సర్వసభ్య సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. సంఘ సభ్యులకు ఎటువంటి ఇబ్బందులున్నా తనకు తెలియజేయాలని కోరారు. అంతకుముందు నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. కమిటీ సభ్యులు నూతన పాలక వర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కొత్తగా ఎన్నికైన అధ్యక్షుడు కోటిపల్లి జేజిబాబు, ప్రధాన కార్యదర్శి కొమ్మోజు గోవిందరాజు, కోశాధికారి పొన్నాడ వెంకటసత్యనరసింహాచారిలచే సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పావులూరి హనుమంతరావు ప్రమాణస్వీకారం చేయించారు.



నక్కపల్లి పార్టీ కార్యాలయం వద్ద కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహిస్తున్న వీసం తదితరులు



బి.కె.పల్లిలో ఆవిర్భావ దినోత్సవ వేడుకలో మాజీ ఎమ్మెల్సీ డీవీఎస్ఎన్ రాజు



కొరుప్రోలు క్యాంపు కార్యాలయంలో వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, పార్టీ నేతలు

పదమూడేళ్లుగా ప్రజాక్షేత్రంలో..



యలమంచిలి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

- అలుపెరుగని పోరాటం... దినదిన ప్రవర్ధమానం
- వాడవాడలా వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవాలు

నక్కపల్లి : పదమూడేళ్లుగా ప్రజాక్షేత్రంలో ఉంటూ ప్రజా సమస్యలపై అలుపెరుగని పోరాటం చేస్తున్న పార్టీ ఒక్క వైఎస్సార్‌సీపీ మాత్రమేనని రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్, విశాఖ దక్షిణ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు వీసం రామకృష్ణ అన్నారు. ఆదివారం వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం నక్కపల్లిలో వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహానేత వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పార్టీ కార్యాలయం వద్ద పతాకావిష్కరణ చేశారు. పదమూడేళ్ల నుంచి ప్రజాక్షేత్రంలోనే ఉంటూ ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటం చేయడం ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డికే సాధ్యమయిందన్నారు. నాడు ఒక్కడితో ప్రారంభమై నేడు కోట్లాది మంది అభిమానులను కూడగట్టుకుని రాష్ట్ర చరిత్రలో కనీవిని ఎరుగని రీతిలో 175 అసెంబ్లీ స్థానాల్లో 151 స్థానాలను కైవసం చేసుకుని అధికారంలోకి వచ్చిందన్నారు. దశాబ్దాల చరిత్ర కలిగిన కాంగ్రెస్‌ను, నలభై ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకునే టీడీపీని మట్టి కరిపించిన ఘనత జగనన్న నేతృత్వంలో వైఎస్సార్‌సీపీదేనన్నారు. ఎన్నికల మేనిఫెస్టోను నూటికి నూరు శాతం అమలు చేసిన ఘనత కూడా తమ పార్టీకే దక్కుతుందన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, మండల పార్టీ అధ్యక్షుడు పొడగట్ల పాపారావు, డీసీఎంఎస్ మాజీ ఉపాధ్యక్షుడు మణిరాజు, వైస్ ఎంపీపీ వెలగా ఈశ్వరరావు, పార్టీ జిల్లా స్టూడెంట్ విభాగం అధ్యక్షుడు కొప్పిశెట్టి హరిబాబు, సీనియర్ నాయకులు మనబాల తాతారావు, వెదుళ్ల రమణ, వెదుళ్ల పాపారావు, సత్తిబాబు పాల్గొన్నారు.



పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న ఏపీ గవర కార్పొరేషన్ చైర్మన్ ప్రసాద్

స్వర్ణాంధ్రప్రదేశ్ లక్ష్యంగా ..

కోటవురట్ల: స్వర్ణాంధ్రప్రదేశ్ లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ఆవిర్భవించిందని మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు అన్నారు. మండలంలో వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. పలు గ్రామాలలో పార్టీ కార్యాలయాల వద్ద పార్టీ జెండాను ఎగురవేసి స్వీట్లు పంచారు. బి.కె.పల్లిలో ఎంపీటీసీ సభ్యుడు పెట్ల రాంబాబు ఆధ్వర్యంలో వేడుక జరిపారు. కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు కేక్ కట్ చేసి సంతోషాన్ని పంచుకున్నారు. వైఎస్సార్‌సీపీ ఆవిర్భవించాక రాష్ట్రంలో మిగతా పార్టీలు గల్లంతయ్యాయన్నారు. రాష్ట్ర ప్రజలు వైఎస్సార్‌సీపీకి అండగా ఉన్నారన్నారు. మాజీ ఉప సర్పంచ్ పెట్ల వెంకటరమణ పాల్గొన్నారు.

యువజన, శ్రామిక, రైతు శ్రేయస్సే ధ్యేయం

ఎస్.రాయవరం : పేద ప్రజల, కార్మిక,కర్షక, రైతు శ్రేయస్సు కోసం వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ ఏర్పాటు అయ్యిందని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. కొరుప్రోలు క్యాంపు కార్యాలయం వద్ద ఆదివారం వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే గొల్ల బాబూరావు కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులకు పంచారు. గ్రామ స్థాయిలో పార్టీ అభివృద్ధికి మరింత కష్టపడాలని కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు చిక్కాల రామారావు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి దత్తుడు సీతబాబురాజు, పాయకరావుపేట మండలశాఖ అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు, పాయకరావుపేట పట్టణశాఖ అధ్యక్షుడు దగ్గుపలి సాయిబాబు, నాయకులు శ్రీపతిరాజు, పోలిశెట్టి పెద ఈశ్వరరావు, జెడ్పీటీసీ లంక సూరిబాబు, ఎస్.రాయవరం పీఏసీఎస్ అధ్యక్షుడు అల్లాడ నాగరాజు, లోవరాజు, సత్యం పాల్గొన్నారు.

మళ్లీ ఎగిరేది మన జెండానే...

మునగపాక : స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరిగింది. పార్టీ ఏర్పాటు చేసి 13వ వసంతంలోకి అడుగిడిన సందర్భంగా ఏపీ గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ ఆధ్వర్యంలో కార్యాలయంలో కేక్ కట్ చేశారు. పార్టీ జెండా ఆవిష్కరించారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్ మోహన్‌రెడ్డి పాలన సాగుతుందన్నారు. సంక్షేమంతో పాటు అభివృద్ధికి పెద్ద పీట వేస్తున్నారన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కూడా వైఎస్సార్‌సీపీ విజయం సాధించి జగనన్న అధికారం చేపట్టడం తథ్యమన్నారు. సర్పంచ్‌లు దిమ్మల అప్పారావు,బొడ్డేడ శ్రీనివాసరావు, భీశెట్టి గంగప్పలనాయుడు,ఎంపీటీసీలు మద్దాల వీరునాయుడు,ఇల్లా శిరీషా నాగేశ్వరరావు, పార్టీ నేతలు సంజీవరావు, నరాలశెట్టి సూర్యనారాయణ, గుంట్ల అప్పారావు, పెంటకోట అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ ఆశయ సాధనకు అనుగుణంగా...

యలమంచిలి : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఆదివారం యలమంచిలి పట్టణ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ నేతలు ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ గోవింద్, పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బొద్దపు యర్రయ్యదొర ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పార్టీ సిద్ధాంతాలపై కార్యకర్తలకు వివరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ గోవింద్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పేద ప్రజల అభ్యున్నతి కోసం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని స్థాపించి నేటికి 13 వసంతాలు పూర్తి చేసుకున్నామని అన్నారు. యువజన శ్రామిక రైతు కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో ఎంతో ఆదరణ కలిగిన పార్టీగా గుర్తింపు పొందిందని, మహానేత వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి ఆశయసాధనకు అనుగుణంగా పనిచేస్తోందని అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుతో పోటీ చేస్తున్న సీతంరాజు సుధాకర్ విజయం తథ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్‌లు బెజవాడ నాగేశ్వరావు, అత్రెపు గుప్తా, రూరల్ పార్టీ అధ్యక్షుడు కొల్లి త్రినాథ్, కౌన్సిలర్లు కొఠారు కొండబాబు, డాక్టర్ త్రినాథ్, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సేనాపతి రాము, గంధం శివ, దూది నరసింహమూర్తి, పిట్టా సత్తిబాబు, చల్లపల్లి సతీష్, గొలగాని నాగు, శేఖర్, నరసింహం పాల్గొన్నారు.

14న పరదేశమ్మతల్లి పండగ



పరదేశమ్మతల్లి అమ్మవారి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గవర కార్పొరేషన్ చైర్మన్ ప్రసాద్

మునగపాక : మేజర్ పంచాయతీ మునగపాకలో ఈ నెల 14న జరిగే పరదేశమ్మ తల్లి పండుగను ఘనంగా నిర్వహించాలని ఏపీ గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ పిలుపునిచ్చారు. మునగపాక పార్టీ కార్యాలయంలో పండుగకు సంబంధించిన పోస్టర్ ను ఆయన ఆదివారం ఆవిష్కరించారు. ఏటా మార్చి మాసంలో వచ్చే పండుగను ఈ ఏడాది కూడా గ్రామస్తుల సహకారంతో ఘనంగా నిర్వహించాలన్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించేలా ఉండేలా చూడాలన్నారు. ఉత్సవ కమిటీ చైర్మన్ బొడ్డేడ అప్పలనాయుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ దిమ్మల అప్పారావు, ఉప సర్పంచ్ పెంటకోట సత్యనారాయణ, మళ్ల సంజీవరావు పాల్గొన్నారు.

బ్రాండిక్స్‌లో 435 మందికి కంటి పరీక్షలు




కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి): బ్రాండిక్స్ అపెరల్ సిటీలో ఆదివారం 102 ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 435 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, 310 మందికి ఉచితంగా కళ్లద్దాలు అందజేశారు. 97 మందికి మందులు అందజేశారు. 33 మందికి కాటరాక్ట్ సర్జరీ చేయించుకోవాలని సూచించారు. కంటి వైద్య శిబిరంలో 20 మంది చిన్నారులు కూడా ఉన్నారు. విశాఖపట్నం శంకరం కంటి ఫౌండేషన్ సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో భాగంగా శిబిరానికి విచ్చేసిన వారికి బ్రాండిక్స్ యాజమాన్యం అల్పాహారం, భోజన సదుపాయం కల్పించారు. బ్రాండిక్స్ భారత భాగస్వామి దొరైస్వామి, బ్రాండిక్స్ సిబ్బంది పాల్గొన్నారు.

యలమంచిలిలో 3 పోలింగ్ కేంద్రాలు



యలమంచిలి డిగ్రీ కళాశాలలో పోలింగ్ బూత్‌ను తనిఖీ చేస్తున్న తహసీల్దారు రాణీ అమ్మాజీ



రాంబిల్లిలో ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రం

యలమంచిలి : యలమంచిలి డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను ఆదివారం మధ్యాహ్నం యలమంచిలి తహసీల్దారు రాణీ అమ్మాజీ తనిఖీ చేశారు. డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన 3 పోలింగ్ కేంద్రాలను ఆమె పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు అందించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించాలని యలమంచిలి పట్టణ ఎస్ఐ కె.పాపినాయుడుతో మాట్లాడారు. ఈ సందర్భంగా యలమంచిలి డిగ్రీ కళాశాల పరిసర ప్రాంతాల్లో పట్టణ పోలీసులు ఆదివారం రెక్కీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ పాపినాయుడు మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు అందరు ప్రశాంతంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని యలమంచిలి డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన 3 పోలింగ్ కేంద్రాల వద్ద 30 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేయడం జరిగిందని, పట్టభద్రులు పోలింగ్ కేంద్రాల వద్దకు వచ్చేటప్పుడు తమ సెల్ ఫోన్‌లు ఇతర సామగ్రిని వెంట తీసుకురాకూడదని అన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అందరూ సహకరించాలన్నారు.

పోలింగ్‌కు సర్వం సిద్ధం

రాంబిల్లి : ఎమ్మెల్సీ ఎన్నిక పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. రాంబిల్లి మండలానికి సంబంధించి రాంబిల్లి ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. మండలంలో పలు గ్రామాలకు చెందిన 834 మంది ఓటర్లు ఉన్నారు. వీరు ఈ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉంది. అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతులకు శిక్షణ





ఎస్‌హెచ్‌జీ మహిళలు, రైతులకు విత్తన గులికల తయారీపై శిక్షణ, (ఇన్‌సెట్) తయారు చేసిన విత్తన గులికలు

కశింకోట : ప్రకృతి వ్యవసాయం సాగించే మెట్ట ప్రాంత రైతులు విత్తన గులికలు తయారు చేసుకుని నాటుకుంటే లాభదాయకంగా ఉంటుందని స్వయం సహాయక సంఘం ఓబీ మజ్జి రత్నం అన్నారు. మండలంలోని జి.భీమవరంలో స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు, రైతులకు ఆదివారం విత్తన గులికల తయారీపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో విత్తన గులికలు నాటితే నీరు లేకపోయినా ఆరు నెలల వరకు పాడైపోయే పరిస్థితి ఉండదని, వర్షం పడిన తర్వాత మొలకలు బాగా వస్తాయని తెలిపారు. ఏ పంట విత్తనాలు నాటాలనుకుంటే వాటిని నిర్దేశిత ప్రక్రియ ద్వారా విత్తన గులికలుగా తయారు చేసుకోవాలని సూచించారు. దీనిలో విత్తనాల ఖర్చు తప్ప ఇతర ఖర్చు ఉండవన్నారు. ఎకరం భూమికి సరిపడా విత్తనాలకు వాటి రకాన్ని బట్టి ఐదేసి కిలోల బంక మట్టి, పిడకల బూడిద, ఘన జీవామృతం పొడి, 2 లీటర్ల బీజామృతంతో కలిపి గులికలుగా తయారు చేసుకోవాలన్నారు. వీటిని వర్షాకాలంలో మెట్ట భూముల్లో నాటుకోవాలన్నారు. విత్తనాలు అన్ని మొలకలు రావడంతోపాటు ఆరోగ్యవంతంగా ఎదిగి పంట దిగుబడి బాగా వస్తుందన్నారు. రైతులు ప్రకృతి వ్యవసాయం చేపట్టడం ద్వారా భూసారం మెరుగుపడుతుందని వివరించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు పటిష్ట ఏర్పాట్లు



కోటవురట్ల పోలింగు కేంద్రం వద్ద ఏఆర్‌వో చంద్రశేఖర్, సీఐ నారాయణరావు



ఎస్.రాయవరం మండలంలో ఎమ్మెల్సీ పోలింగ్ బూత్ కేంద్రం



పోలింగ్ అధికారులకు సూచనలిస్తున్న ఎస్ఐ అలీ



పోలింగ్ కేంద్రానికి చేరుకున్న సామగ్రి



నక్కపల్లిలో పోలింగ్ బూత్‌లు పరిశీలిస్తున్న ఎంపీడీవో, ఎస్ఐలు

కోటవురట్ల : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు పటిష్ట ఏర్పాట్లు చేసినట్టు అసిస్టెంట్ రిటర్నింగ్ ఎన్నికల అధికారి చంద్రశేఖర్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగు కేంద్రాన్ని ఆయన ఆదివారం సందర్శించి అక్కడి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 1092 ఓటర్లు ఉండగా ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. ఓటర్లు ఎటువంటి ప్రలోభాలకు లోనుకాకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు.

పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రతా చర్యలు తీసుకున్నట్టు నక్కపల్లి సీఐ నారాయణరావు తెలిపారు. ఆదివారం ఆయన ఎస్ఐ నారాయణరావుతో కలిసి పోలింగ్ కేంద్రం వద్ద భద్రతా ఏర్పాట్లు పరిశీలించారు. నక్కపల్లి సర్కిల్ పరిధిలో ఎస్.రాయవరం, కోటవురట్ల, నక్కపల్లి మండలాల్లో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు లేవన్నారు. ప్రశాంతంగా పోలింగ్ జరిగేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు.

ఎస్.రాయవరం మండలంలో...

ఎస్.రాయవరం : ఉత్తరాంధ్ర పట్టభద్రులు నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు తహసీల్దార్ శ్యామ్ ఆదివారం తెలిపారు. మండలంలో 28 గ్రామ పంచాయతీల నుంచి 1131 మంది గ్రాడ్యుయేటర్లు ఓటు హక్కును వినియోగించుకోనున్నారన్నారు. పి.ధర్మవరం ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ 188 లో సోమవారం ఉదయం 8 గంటల నుంచి 4 గంటల పోలింగ్ నిర్వహిస్తామన్నారు. పోలింగ్ బూత్ పరిధి లో 144 సెక్షన్ కూడా అమలు చేయడం జరిగిందన్నారు. ఓటు హక్కు వినియోగించుకునేందుకు వచ్చిన గ్రాడ్యుయేట్లు ఆండ్రాయిడ్ మొబైల్స్ తీసుకుని రావద్దని సూచించారు.

పోలింగ్ కేంద్రానికి ఎన్నికల సామగ్రి

మునగపాక : సోమవారం జరగనున్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించిన సామగ్రి పోలింగ్ కేంద్రానికి ఆదివారం సాయంత్రం చేరుకుంది. మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్లో 196 పోలింగ్ కేంద్రాన్ని ఎన్నికకు కేటాయించారు. పోలింగ్ ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు 1239 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకునేలా ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే పోలింగ్ కేంద్రాన్ని పోలీసులు తమ స్వాధీనంలో ఉంచారు. ఎన్నికల అధికారులకు తగు సూచనలు, సలహాలను ఎస్ఐ మహమ్మద్ అలీ అందజేశారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నిక జరిగేలా అందరూ సహకరించాలన్నారు.

నక్కపల్లి : ఉత్తరాంధ్ర పట్టబద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి సోమవారం నిర్వహించే పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. పాయకరావుపేట నియోజకవర్గంలో 5008 మంది ఓటర్లు, పట్టభద్రులు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. పోలింగ్‌నకు సంబంధించి మండల కేంద్రం నక్కపల్లిలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో(బాలికలు) రెండు బూత్‌లు ఏర్పాటు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఇక్కడ 144వ సెక్షన్ అమలు చేస్తూ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు ఎంపీడీవో సీతారామరాజు, ఎస్ఐ శిరీష తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద తాగునీరు, వాడుకనీరు, మెడికల్ క్యాంపు వంటి సదుపాయాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నక్కపల్లిలో 1118 మంది ఓటర్లు ఉన్నారన్నారు. పోలింగ్ కేంద్రాలను వారు ఆదివారం పరిశీలించారు.

పాయకరావుపేట : నేడు జరుగబోయే ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు అధికారులు ఏర్పాట్లు చేసారు. పట్టణంలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో గల బూత్ నంబర్లు 186,187 గల రూముల్లో ఓటింగ్ జరుగనుంది. మండలంలో 1667 మంది పట్టభద్రులు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఎన్నికల సిబ్బంది బ్యాలెట్ బాక్స్‌లతో పోలింగ్ కేంద్రాల వద్దకు చేరుకున్నారు. స్థానిక సి.ఐ. పి.అప్పలరాజు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసారు. నర్సీపట్నం ఆర్‌డివో జయరాం పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.


పోలింగ్ ఏర్పాట్ల పరిశీలన

ఎస్.రాయవరం : మండలంలో సోమవారం నిర్వహించే ఎమ్మెల్సీ ఎన్నిక పోలింగ్ బూత్ వద్ద ఏర్పాట్లను నర్సీపట్నం ఆర్డీవో జయరామ్ పరిశీలించారు. ఓటర్లకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు ఉండాలని తహసీల్దార్ శ్యామ్‌కు సూచించారు. పోలింగ్ బూత్ వద్ద సదుపాయాల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. అంతకుముందు నర్సీపట్నం డీఎస్పీ ప్రవీణ్‌కుమార్ కూడా పోలింగ్ కేంద్రం వద్ద బందోబస్తు ఏర్పాట్లు పరిశీలించారు. పోలింగ్ సమయంలో స్థానికులు బూత్ వద్ద నిలుచని ఉండకుండా చూడాలన్నారు. ఏజెంట్ల వివరాలు ముందుగా తీసుకుని బయట వ్యక్తులు రాకుండా చూడాలన్నారు.

పోలిపల్లి అమ్మవారి పండగ ప్రారంభం

అనకాపల్లిటౌన్ : రేబాక గ్రామంలో శ్రీ పోలిపల్లి అమ్మవారి పండగ వేడుకలు ఆదివారం నుంచి మంగళవారం వరకూ నిర్వహిస్తున్నట్లు గ్రామ సర్పంచ్ మార్టురు సన్యాసమ్మ చెప్పారు. ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి యువజన సేవాసంఘం ఆధ్వర్యంలో మధ్యాహ్నం అన్న సమారాధన నిర్వహించారు. సోమవారం రాత్రి 'మాయా బజార్'నాటకం, మంగళవారం రాత్రి 7 గంటలకు 'డాన్స్ బేబీ డాన్స్' కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

కమనీయం భద్రాదేవి భావనారాయణ కల్యాణం



భావనారాయణస్వామి కల్యాణ వేడుక



మంత్రి అమర్‌నాథ్‌కు స్వామివారి చిత్రపటాన్ని అందిస్తున్న సంఘ సభ్యులు

స్వామివారిని దర్శించుకున్న మంత్రి అమర్‌నాథ్

అనకాపల్లిటౌన్ : స్థానిక వేల్పులవీధి కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ ఖాళీస్థలంలో పద్మశాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం భద్రాదేవి సమేత భావనారాయణస్వామి కల్యాణోత్సవం కమనీయంగా జరిగింది. ఇమంది విశ్వనాథ్, రమాదేవి, ఇమంది సురేష్, మానసాదేవి, బేతా కన్నారావు, రత్నం దంపతులచే బ్రహ్మర్షి ఆమంచి ఆంజనేయ గురుస్వామి శాస్త్రోక్తంగా కల్యాణ వేడుకను జరిపారు. ఈ కల్యాణోత్సవాన్ని వీక్షించేందుకు అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్ హాజరై భావనారాయణ సమేత భద్రాదేవిని దర్శించుకున్నారు. సంఘ సభ్యులు మంత్రి అమర్‌నాథ్‌కు భావనారాయణ, భద్రాదేవి చిత్రపటాన్ని అందించి ఘనంగా సత్కరించారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన జరిగింది. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు పంపాన సత్యనారాయణ, గౌరవాధ్యక్షుడు ఆవుజారి రామకృష్ణ, కార్యదర్శి కాకి ధర్మారావు, ఉపాధ్యక్షుడు వానపల్లి రామ్మోహనరావు, ప్రధాన కార్యదర్శి దొడ్డి ఈశ్వరరావు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.